# భువనగిరికి ఐటీ.. ఇండస్ట్రియల్ హబ్

*వేలాది మంది యువతకు ఉపాధి కల్పిస్తాం*

త్వరలోనే బస్వాపూర్ రిజర్వాయర్ ద్వారా సాగునీరు

- స్వయంగా నేనే వచ్చి ప్రారంభోత్సవం చేస్తా
- నృసింహసాగర్‌తో లక్ష ఎకరాలు సస్యశ్యామలం
- కాంగ్రెస్ హయాంలో అరాచక పాలన
- పైళ్ల శేఖర్‌రెడ్డిని దీవించి హ్యాట్రిక్ విజయం అందించాలి
- భువనగిరి ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్


భువనగిరి ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌కు దగ్గరలో ఉన్న భువనగిరిలో ఐటీ హబ్‌తోపాటు ఇండస్ట్రియల్ హబ్ తీసుకొస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఈ విషయమై ఐటీ మంత్రి కేటీఆర్‌తో చర్చిస్తానన్నారు. రెండు హబ్‌లతో వేలాది మంది యువతకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. సోమవారం భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న బస్వాపూర్ రిజర్వాయర్ పనులు 98 శాతం పూర్తయ్యాయని, మరోసారి అధికారంలోకి రాగానే తానే స్వయంగా వచ్చి ప్రారంభిస్తానని చెప్పారు. త్వరలోనే సాగు నీరు అందిస్తామని, తద్వారా లక్ష ఎకరాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. ప్రత్యేక జిల్లాగా ఏర్పాటైన తర్వాత అద్భుతమైన అభివృద్ధి జరిగిందన్నారు. నాడు కరువుతో ఉన్న భువనగిరిలో ఇవ్వాల అద్భుతమైన పంటలు పండిస్తున్నారని చెప్పారు. ఇక్కడ కాల్వలు, గోదావరి జలాలు రావాలని ఎన్నో కలలు కన్నామని, కాల్వల పనులు జరుగుతున్నాయని, త్వరలోనే పూర్తవుతాయని చెప్పారు. ఘట్‌కేసర్ దాటితే 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న యాదాద్రి జిల్లా భవిష్యత్‌లో బంగారు తునక అవుతుందన్నారు.

### నాడు భువనగిరిలో అరాచక పాలన

కాంగ్రెస్ పాలనలో భువనగిరిలో అశాంతి ఉండేదని, ఆ పార్టీ అరాచక శక్తులు, మూకల సామ్రాజ్యాన్ని పెంచిపోషించిందని సీఎం కేసీఆర్ అన్నారు. ప్రజలు ఎంతో గోస పడ్డారని గుర్తు చేశారు. అలాంటి అరాచక, కిరాతక వాదులను బీఆర్ఎస్ ఏరి పారేసిందని, ఇప్పుడు భువనగిరి ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు ఆగం కావద్దని, వాస్తవమేంటో గుర్తించాలని, మంచిచెడులను ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. ధరణి పోతే మళ్లీ రైతులకు కొట్లాటలు, అవినీతి, అరాచకత్వం వస్తుందన్నారు. కాంగ్రెస్‌తో పెద్ద ప్రమాదం ఉందని, పైరవీ కారుల హస్తం పార్టీని రానివ్వొద్దని పిలుపునిచ్చారు. మూడు గంటల కరెంట్ ఇస్తామంటున్న కాంగ్రెస్‌కు కరెంట్ షాక్ ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ వస్తే దళారుల రాజ్యం వస్తుందన్నారు.

### లక్ష్మీనరసింహుడి ఆశీస్సులతో అభివృద్ధి..

జిల్లాకు యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి పేరు పెట్టుకున్నామని గుర్తు చేశారు. తెలంగాణ రాక పోతే యాదాద్రి కొత్త జిల్లా ఏర్పాటయ్యేది కాదన్నారు. ప్రజల పోరాట ఫలితంగానే జిల్లా సాధ్యమైందన్నారు. కొత్త కలెక్టరేట్‌ను ప్రారంభించుకున్నామని చెప్పారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో తెలంగాణ అభివృద్ధి జరుగుతుందన్నారు. గుట్టలో భూముల విలువ అమాంతం పెరిగిందని, కోట్లల్లో పలుకుతున్నాయని తెలిపారు.

## 50 వేల మెజార్టీతో పైళ్ల గెలుపు ఖాయం

ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి భువనగిరిని అద్భుతంగా అభివృద్ధి చేశారని కేసీఆర్ ప్రశంసించారు. ఎమ్మెల్యే గురించి చెప్పాల్సిన అవసరం లేదని, ఆయన్ను వరుస విజయాలు వరిస్తున్నాయని పేర్కొన్నారు. భువనగిరిలో మళ్లీ గెలిచేది శేఖర్‌రెడ్డినే అని అన్నారు. తన సర్వే ప్రకారం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి 50 వేల మెజార్టీతో గెలువబోతున్నారని స్పష్టం చేశారు. పైళ్లను మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించి దీవించాలని పిలుపునిచ్చారు. అందరికీ సన్నబియ్యం, 24 గంటల కరెంట్ ఉండాలంటే బీఆర్ఎస్‌ను మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు ఉమామాధవరెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, చాడ కిషన్‌రెడ్డి, గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్, రైతుబంధు సమితి చైర్మన్ కొలుపుల అమరేందర్, భువనగిరి మున్సిపల్ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు పాల్గొన్నారు.

# సరిహద్దులో తనిఖీలు కట్టుదిట్టంగా చేపట్టాలి

- నల్లగొండ కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్


సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 16 : జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల్లో భద్రత కట్టుదిట్టంగా ఉండాలని నల్లగొండ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. మండలంలోని పంతంగి టోల్‌గేటు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సోమవారం ఆయన పరిశీలించారు. ప్రతి వాహనానికి చెందిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించాలని ఎన్నికల నిబంధనలకు ఉల్లంఘించి వస్తువులను, నగదు అక్రమ రవాణాపై గట్టి నిఘా ఉంచాలని సూచించారు. ఆయనతో పాటు చౌటుప్పల్ ఆర్డీఓ జగన్నాథరావు ఉన్నారు.

### పంతంగి వద్ద రూ.13.82 లక్షలు సీజ్

ఎన్నికల నేపథ్యంలో పంతంగి టోల్‌గేట్ దగ్గర ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సోమవారం రూ.13,82,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చౌటుప్పల్ పోలీసులు తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో హైదరాబాద్ మణికొండకు చెందిన కర్నాటి రామలక్ష్మి వద్ద రూ.2.50 లక్షలు, ఖమ్మం జిల్లాకు చెందిన ముల్వా మాల్యాద్రి వద్ద నుంచి రూ. 2.12 లక్షలు, చౌటుప్పల్ మండలం మల్కాపురం గ్రామానికి చెందిన ఈడ్దుల మస్తాన్‌బాబు వద్ద నుంచి రూ. 4.70 లక్షలు,గుంటూరు జిల్లాకు చెందిన పాటేటి వంశీ కృష్ణ వద్ద రూ. 4.50 లక్షలు సీజ్ చేసి నల్లగొండ డీటీఓ వద్ద జమ చేసినట్లు పోలీసులు తెలిపారు.

### కేతేపల్లిలో రూ. 65 వేలు స్వాధీనం

కేతేపల్లి : మండలంలోని చీకటిగూడెం గ్రామ శివారులో 65 వ నంబరు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును నకిరేకల్ రూరల్ సీఐ రాఘవరావు పరిశీలించారు. ఈ తనిఖీల్లో రూ.62 వేల నగదు పట్టుబడినట్లు సీఐ తెలిపారు.

### కట్టంగూర్‌లో రూ.1.78 లక్షలు

కట్టంగూర్ : కట్టంగూర్‌లోని నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఒక వాహనంలో రూ. 81వేలు, మరో వాహ నంలో రూ. 97,500లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ డి.రాజు తెలిపారు నగదును డీటీఓకు అప్పజెప్పినట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

### మర్రిగూడలో రూ.9లక్షలు సీజ్

మర్రిగూడ :మండలంలోని సరంపేట ఎక్స్ రోడ్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో సోమవారం రాత్రి పోలీసులు రూ.9లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని లెంకలపల్లి గ్రామానికి చెందిన బెజ్జాల శ్రీశైలం ఖుదాభక్షిపల్లి నుంచి లెంకలపల్లి వైపు బైక్ వెళ్తుండగా ఆయన వద్ద రూ.9 లక్షలు పట్టుకున్నట్లు ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపారు.

### వలిగొండలో రూ.3 లక్షలు పట్టివేత

వలిగొండ : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున భువనగిరి, చిట్యాల రహదారిపై సోమవారం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. స్కూటీ డిక్కీలో తరలిస్తున్న రూ. 3,01,650 లను పట్టుకున్నారు. డబ్బులు తీసుకుపోతున్న వ్యక్తి సరైన ఆధారాలు చూపక పోవడంతో నగదును భువనగిరి డీటీఓ వద్ద జమ చేసినట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

# అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి

- నార్కట్‌పల్లి సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నరేందర్‌రెడ్డి

నార్కట్‌పల్లి, అక్టోబర్ 16 : మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా అధికారులు అభివృద్ధి నివేదికను చదివి వినిపించారు. పలు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు విపరీతంగా ఉన్నాయని ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులు సమస్య లేకుండా చూసుకోవాలని ఎంపీపీ సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం అధికారులు పారదర్శకంగా పనులు నిర్వహించాలని సూచించారు. పల్లె ప్రగతితో గ్రామాల రూపురేఖలు మారాయని గుర్తు చేశారు. గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరి, వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## నేడు శాలిగౌరారానికి ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రాక

శాలిగౌరారం, అక్టోబర్ 16 : మండల కేంద్రానికి మంగళవారం తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ దంపతులు రానున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి చాడ హతీశ్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో వారు మాట్లాడారు. జనచైతన్య యువజన సంఘం, ఆదర్శ యువజన సంఘం, లోకమాన్య యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ సంబురాలకు ముఖ్య అతిధులుగా హాజరుకానున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు విధిగా హాజరు కావాలని కోరారు.

## క్రైస్తవులు బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలి

- క్రిస్టియన్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రేఖల భద్రాద్రి


సామేల్‌కు చెక్కు అందజేస్తున్న రేఖల భద్రాద్రి

నల్లగొండ, అక్టోబర్ 16: రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ప్రస్తుతం చేస్తున్న అభివృద్ధి కొనసాగనున్న నేపథ్యంలో క్రైస్తవులు బీఆర్ఎస్ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రేఖల భద్రాద్రి అన్నారు. నల్లగొండ మండలం చందన పల్లిలో యూదా గోత్రపు సింహవాము మిస్ట్రీస్ చర్చి నిర్మాణానికి రేఖల అన్నమ్మ ట్రస్ట్ ద్వారా పాస్టర్ కే సామేల్‌కు రూ.25 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవులకు సీఎం కేసీఆర్ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ఆయన మరోసారి సీఎం అయ్యేందుకు మనం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాస్టర్లు చర్చిల్లోకి వచ్చే వారికి ప్రభుత్వం చేస్తున్న మంచి పనుల వివరించి మద్దతు తెలపాలని సూచించాలన్నారు.

## లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ఆర్థిక సాయం


నకిరేకల్ పట్టణంలో ఆర్థిక సాయం అందజేస్తున్న లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

నకిరేకల్, అక్టోబర్ 16 : నకిరేకల్‌కు చెందిన పొడిచేటి సైదులు బైకుపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దాంతో తలకు బలమైన గాయం కావడంతో కోమాలోకి వెళ్లి పోయాడు. సైదులు భార్య ఏడాది క్రితం మరణించింది. పాప, బాబు అనాథలయ్యారు. సైదులు మెరుగైన చికిత్సకు డబ్బులు అందక, పిల్లలకు సరైన తిండి లేక అల్లాడుతున్నారని తెలుసుకుని లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం సైదులు అత్తమామలకు రూ.20,200 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేశ్, ఆసీఫ్, శ్రీను, సైదులు,ప్రసాద్, కృష్ణప్రసాద్, విష్ణు పాల్గొన్నారు.